# వేతనం కోసం వెతలు..

అరకొర జీతాలతో బస్తీ దవాఖాన ఉద్యోగుల ఇబ్బందులు



తిలక్‌నగర్‌లోని బస్తీ దవాఖాన

**నల్లకుంట:** వేతన బకాయిల కోసం బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్(సపోర్టింగ్) ఉద్యోగులు గత నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వేతనాలతో పనిచేస్తున్న సపోర్టింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఉద్యోగులు వాపోతున్నారు. గురువారం ఉదయం 9.45 గంటల సమయంలో నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్‌లోని బస్తీ దవాఖానను తెరిచారు. దీంతో వృద్ధులు షుగర్ పరీక్షల కోసం దవాఖానకు వచ్చారు. మాకు నాలుగు నెలలుగా వేతనాలు రావడంలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు డీఎంఈ కార్యాలయానికి వెళుతున్నామని చెప్పి వెళ్లిపోయారు. ఆ తరువాత మధ్యాహ్నం 12.15 గంలకు తిరిగి బస్తీ దవాఖాన తెరిచారని, ఆ సమయంలో దవాఖాన తెరిస్తే ఎవరికి ఉపయోగమని బస్తీ వాసులు ప్రశ్నిస్తున్నారు.

**నిధులు దారి మళ్లించారా ?**

వైద్య ఆరోగ్య శాఖ సూచన మేరకు ఆర్థిక శాఖ నుంచి ఇటీవల బస్తీ దవాఖాన సిబ్బంది నాలుగు నెలల వేతన బకాయిల్లో రెండు నెలల బకాయిలు ఇటీవల విడుదల చేసినట్లు సమాచారం. కాగా అంతలోనే జూనియర్ డాక్టర్లు(హౌజ్ సర్జన్లు) తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. జూడాల సమ్మెతో ఉస్మానియా, గాంధీ లాంటి ప్రధాన ఆసుపత్రుల్లో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం జూడాలతో చర్చలు జరిపి, జూడాల డిమాండ్లు పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చింది. దీంతో జూడాలు సమ్మె విరమించి యధావిధిగా విధుల్లో చేరారు. ఈ క్రమంలో బస్తీ దవాఖాన ఉద్యోగుల వేతన బకాయిల కోసం విడుదల చేసిన నిధులను తిరిగి వెనక్కి తీసుకుని జూడాల సమస్యల పరిష్కారం కోసం వినియోగిస్తున్నారని బస్తీ దవాఖాన ఉద్యోగులు అంటున్నారు. అదే విషయమై మాట్లాడేందుకు సపోర్టింగ్ ఉద్యోగులు గురువారం కొద్ది సేపు బస్తీ దవాఖన మూసి వేసి డీఎంఈ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం.

## అంబేడ్కర్ లా కళాశాలకు రెండో స్థానం

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ఇండియా టుడే ప్రకటించిన ర్యాంకింగ్‌లో బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ లా కళాశాలకు రెండవ స్థానం లభించినట్లు అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్ జి.వివేక్, కార్యదర్శి జి.వినోద్‌లు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేడ్కర్ లా కళాశాల రాష్ట్రంలో రెండవ స్థానం, జాతీయ స్థాయిలో ఐదవ స్థానం సాధించి బెస్ట్ కాలేజీగా గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో వసతులు, టీచింగ్, చదువుకునే వాతావరణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఇండియా టుడే సంస్థ మంగళవారం ర్యాంకులను ప్రకటించిందని తెలిపారు.

## ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మారం జగదీష్, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణ గౌడ్

**కాచిగూడ:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని దేశ వ్యాప్తంగా ప్రవేశ పెట్టాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రతినిధులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నేతలు మారం జగదీష్, ఎ.శ్రీనివాస్ రావు, కె.లక్ష్మణ్, కస్తూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


## సంజీవయ్యనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



అధికారులు, బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న పావని వినయ్‌కుమార్

**చిక్కడపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ సమావేశంలో ప్రశ్నిస్తానని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని సంజీవయ్యనగర్ బస్తీలో డీహెచ్‌ఎంసీ డీఈఈ గీత, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌లతో కలసి ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ బస్తీలో నిర్మాణ దశలో అగిపోయిన కమ్యూనిటీ హాల్‌ను త్వరలోనే అభివృద్ధిచేసేందుకు చర్యలు చేపడుతాన్నారు. డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కారంచేందుకు జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో ప్రశ్నిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకులసురేందర్, జ్ఞానేశ్వర్, స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.

## పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడు



పీవీకి నివాళులర్పిస్తున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

**చిక్కడపల్లి:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు కొనియాడారు. త్యాగరాయగానసభ నిర్వహణలో కళాసుబ్బారావు కళావేదికలో గురువారం నిర్వహించిన భారత పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ కాశీవిశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు అద్యుడన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన ఆయన అపర చాణిక్యుడని ప్రశంసించారు. ఆయన బహుభాషా కోవిదుడన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, పబ్బ వైకుంఠం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల జనజాతరను జయప్రదం చేయాలి

**లాలాపేట:** ఎమ్మార్పీఎస్ పురిటిగడ్డ ఈదుమూడిలో వచ్చే నెల 7న తలపెట్టిన మాదిగల జనజాతర సభను విజయవంతం చేయాలని డా. నంద్రు నరసింహారావు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం ఆయన అధ్యక్షతన మాదిగ సంఘాలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పాటై 30 ఏళ్లు కావస్తుందన్నారు. కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు ఇటుక రాజు, మాతంగి ఓదెలు, తపెట్ల ప్రవీణ్‌కుమార్, కత్తి ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

**గాంధీఆస్పత్రి:** నిరుద్యోగ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్న నిరుద్యోగ ఏజేసీ నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను గురువారం ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల భిక్షతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మోతీలాల్ నాయక్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

## ఓయూలో బొజ్జా తారకం జయంతి

**ఉస్మానియా యూనివర్సిటీ:** సామాజిక వేత్త, న్యాయవాది బొజ్జా తారకం 85వ జయంతిని ఓయూలో విద్యార్థులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో బొజ్జా తారకం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సైదులు, శ్రీకాంత్‌యాదవ్, చంద్రశేఖర్, రఘు, సాయి, నగేశ్, గోపి, కార్తీక్, సదానందం, తరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి విరాళం



దేవాలయ నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న ముఠా జైసింహ

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. కల్వకుర్తి గుడి తండా గ్రామ పంచాయతీలో వెలిసిన ఉనసతి సీతమ్మ వారి దేవాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ రూ.1,01,116 ఆర్థిక సహాయం అందజేశారు. బాగ్‌లింగంపల్లి లంబాడి తండా బస్తీలో గురువారం దీనికి సంబంధించిన చెక్కును ముఠా జైసింహ బస్తీ అధ్యక్షులు కల్యాన్ నాయక్‌కు, బస్తీ వాసులకు అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజల సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిఇపారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్ మాట్లాడుతూ 500 సంవత్సరాల చరిత్ర గల గుడి నిర్మాణం కోసం ఆర్థిక సహయం అందించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన తనయుడు ముఠా జైసింహలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బబ్లూ, రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నే దామోదర్ రెడ్డి, లంబాడి తండా నాయకులు సోమ్లనాయక్, నారాయణనాయక్, దేవేందర్‌నాయక్, హోబానాయక్, నందునాయక్, రవి, గోవింద్‌నాయక్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జాతీయ సదస్సు

**కాచిగూడ:** మార్వాడి శిక్షా సమితి, రామ్‌నాథ్ గుల్జారీలాల్ కేడియా కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సహకారంతో ఈనెల 28, 29 తేదీల్లో కాచిగూడలోని కళాశాలలో భవిష్యత్ వ్యాపార ధోరణులు, అత్యాధునిక ఆవిష్కరణలపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విద్యార్థులు సెమినార్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## దివ్యాంగులకు అన్నదానం



**నల్లకుంట:** నల్లకుంటకు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు దివంగత పీఎస్ చౌదరి స్మారకార్థం గురువారం బోయిగూడలోని హోమ్ ఫర్ డిజేబుల్‌లో 150 మంది దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు రాజు, బాలాజీ, మోహన్, ఎంవీ రమణా రావు, సీహెచ్. మురళీ కృష్ణ, నిర్మల, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూలు



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

**కవాడిగూడ:** చట్ట వ్యతిరేకంగా బౌన్సర్ల పేరుతో రౌడీలను, గుండాలను అక్రమంగా నియమించుకొని అక్రమంగా డోనేషన్లు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై దాడులకు పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనగల శ్యాంకురామ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను బీసీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు కళాశాలలు ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాలల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా డోనేషన్ల పేరుతో లక్షల రూపాయలు దండుకుంటూ, మెరిట్ ఉన్నటువంటి విద్యార్థులకు సీట్లు ఇవ్వకుండా నిరాకరిస్తున్నారన్నారు. అడ్మిషన్లు కావాలని సంప్రదిస్తున్న పేద విద్యార్థులను వారి తల్లిదండ్రులను బౌన్సర్ల పేరుతో, పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు అయిన గుండాలను, రౌడీలను నియమించుకోని విద్యార్థులను, వారి తల్లిదండ్రులపై తీవ్రంగా బెదిరిస్తు భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్, గూడూరు భాస్కర్, పాలకురు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



**కాచిగూడ:** రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎండీ మాక్సూద్ తెలిపిన వివరాల ప్రకారం... యాకుత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (45) ఎంఎంటిఎస్ రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు ఢీకొని వృద్ధుడి మృతి

**అడ్డగుట్ట:** రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ఎక్కిరల పెద్దరాజు (69) వ్యవసాయం చేస్తుంటాడు. అయితే తిరుపతి దేవస్థానానికి వెళ్లొస్తానని చెప్పి ఈ నెల 26న సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరాడు. మరుసటి రోజు ఉదయం చర్లపల్లి నుంచి మౌలాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలో పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

## నిబంధనలు పాటించని కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి

**ఉస్మానియా యూనివర్సిటీ:** నిబంధనలకు విరుద్ధంగా బీ కేటగిరి సీట్లను అమ్ముకున్న ఇంజినీరింగ్ కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉన్నత విద్య కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేశ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ రాకముందే కొన్ని కాలేజీల యాజమానులు బీ కేటగిరిలో 99 శాతం సీట్లను లక్షల రూపాయాలకు విక్రయిరచారని ఆరోపించారు.

## ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**రాంగోపాల్‌పేట్:** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయ ప్రాంగణంలో బోనాల జాతర ఏర్పాట్లపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. పోలీసులు, జీహెచ్‌ఎంసీ, జల మండలి, ఆర్‌అండ్‌బీ, హెల్త్, దేవదాయ శాఖ అధికారులు భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లను వెల్లడించారు.

**పటిష్ట బందోబస్తు:డీసీపీ**

బోనాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. రెండు రోజుల పాటు 24 గంటలు పనిచేసేలా క్రైం టీంలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయం లోపల, బయట ఎలక్ట్రిసిటీ అధికారులు ఫైర్ పరికరాల పనితీరు సరిచూసుకోవాలని, సకాలంలో అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు.

**పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం: జోనల్ కమిషనర్**

జాతరలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్ తెలిపారు. 24 గంటల పాటు కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రోడ్ల ప్యాచ్‌వర్కులు చేపట్టామని, వరదనీటి డ్రైన్‌లు శుభ్రం చేస్తున్నామని, ప్రతి స్ట్రీట్‌లైట్ వెలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**నిరంతర తాగునీటి సరఫరా: వినోద్ జీఎం**

ఆలయ పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల పాటు నిరంతరంగా తాగునీటి సరఫరా చేస్తామని, ఐదు ప్రాంతాల్లో నీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు సరఫరా చేస్తామని, క్యూలైన్లలో కూడా భక్తులకు తాగునీరు అందిస్తామని, డ్రైనేజీ లైన్లు మొత్తం క్లీన్ చేసి ఎక్కడ మురుగు నీటి ప్రవాహం లేకుండా చూస్తామని చెప్పారు.

**సీపీఆర్‌పై అవగాహన అవసరం: దేవాదాయ శాఖ కమిషనర్**

జాతరలో పాల్గొనే పోలీసులు, వలంటీర్లు, ఆలయ కమిటీలకు సీపీఆర్‌పై అవగాహన ఎంతో అవసరమని దేవదాయ శాఖ కమిషనర్ హన్మంతు సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు దీనిపై అవగాహన కల్పించాలని అన్నారు,

**ప్రత్యేక వైద్య శిబిరాలు: రాజేశ్వరి**

భక్తుల కోసం మహంకాళి పోలీస్ స్టేషన్, రోచా బజార్, అంజలీ థియేటర్, సంతోష్ స్వీట్ హౌజ్ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, వైద్యులు, సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రాజేశ్వరి తెలిపారు. అలాగే ప్రత్యేక అంబులెన్సులు, ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

**భక్తుల మనోభావాలు గౌరవించండి: మంత్రి**

ఆలయ ముందు రోడ్డు ఎత్తుగా ఉండి అమ్మవారు పూర్తిగా లోతట్టులో ఉండి భక్తులకు కనిపించడం లేదని ఇది సాంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని, తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర మాజీ కార్పొరేటర్లు వసంత యాదవ్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



గాంధీనగర్‌లో సర్వే పనులు పర్యవేక్షిస్తున్న ఎస్‌ఈ పి.బ్రహ్మం, డీఈ హేమచంద్

**చిక్కడపల్లి:** విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని టీజీఎస్‌పీడీసీఎల్ సెంట్రల్ ఆపరేషన్ ఎస్‌ఈ పీ.బ్రహ్మం అన్నారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడానికి కొత్తగా రూపొందించిన టీజీఏఐఎంఎస్ యాప్ తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించి సర్వే చేస్తున్నారు. గురువారం అశోక్ నగర్, గాంధీనగర్‌లో ప్రాంతాలల్లో సర్వే పనులను ఎస్‌ఈ పి.బ్రహ్మం అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఏఐఎంఎస్ యాప్ ద్వారా వినియోగరారుల ఫిర్యాదు మేరకు ఖచ్చితమైన వారి నివాస ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేయడానికి వీలుఉంటుందన్నారు. సైఫాబాద్ డివిజన్‌లో దాదాపు 138 ఫీడర్లు ఉన్నాయని, వీటిలో 11కేవీ ఫీర్లు 40 ఫీడర్ల సర్వే పూర్తి అయిందన్నారు.

## మూసారంబాగ్ బ్రిడ్జి పనుల్లో జాప్యాన్ని నివారించండి



మూసారంబాగ్ బ్రిడ్జ్ నిర్మాణ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**అంబర్‌పేట:** నిత్యం వేలాదిమంది అవస్థలు పడుతున్నారు...చేపట్టిన పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోంది అంటూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబర్‌పేట ముసారంబాగ్ ప్రాంతాల వద్ద మూసీనదిపై నిర్మిస్తున్న వంతెన పనుల్లో జరుగుతున్న జాప్యం పై గురువారం ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. మూసీ నదిపై రాకపోకలు నిలిపివేసి బ్రిడ్జ్ నిర్మిస్తుండడంతో నిత్యం వేలాదిమంది వాహనదారులు అవస్థలు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతార్జాతీయ డిజైన్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించే బ్రిడ్జ్ పనుల్లో జాప్యం చోటు చేసుకోకుండా అధికారులు వ్యవహరించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ ప్రాంతంలో విద్యుత్ కేబుళ్లు అడ్డుగా ఉండడంతో జాప్యం జరుగుతుందన్న అధికారులకు పరిష్కారాన్ని చూపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యుత్ శాఖ ప్రతిపదించిన నిధులను కూడా మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. వర్షకాలం ఉన్నప్పటికీ ప్రత్యామ్నాయం చర్యలతో బ్రిడ్జ్ నిర్మాణ పనులను కొనసాగించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పటికే అంబర్‌పేట నియోజకవర్గం మొత్తం నిర్మాణ పనులు, ట్రాఫిక్‌తో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జ్ పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పోరేటర్ విజయ కుమార్‌గౌడ్, అధికారులు ఇంజనీరింగ్ విభాగం సురేష్, రేణుక, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## వికలాంగుల కోసం ప్రత్యేక విద్యా పాలసీ ఏర్పాటు చేస్తాం



సదస్సులో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్యా పాలసీని ఏర్పాటు చేస్తామని, వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్(టీవీసీసీ) చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో వికలాంగుల విద్య, స్థితిగతులు, ప్రభుత్వం పాత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముత్తినేని వీరయ్య వర్మ మాట్లాడుతూ 1985లో కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ వికలాంగులకు విద్య కోసం ప్రాంతీయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. వికలాంగుల్లో విద్య, వృత్తి శిక్షణ, వైద్య పునరావాసం కోసం తమవంతుగా కృషి చేస్తామన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న మంగళారపు లక్ష్మణ్

**కాచిగూడ:** రాష్ట్ర మంత్రి వర్గంలో మున్నూరు కాపులకు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ప్రధానకార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ జనాభాలో అత్యధిక జనాభా కలిగి రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న మున్నూరుకాపులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విస్మరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో మున్నూరుకాపుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నా ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్నూరుకాపులకు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రభుత్వ నామినెట్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత



సయ్యద్ ఇమామ్‌ను సన్మానిస్తున్న గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థ ప్రతినిధులు

**ముషీరాబాద్:** సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్‌హాజ్ సయ్యద్ మదర్ సాబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఇమామ్ అన్నారు. వారు చేస్తున్న సేవలకు గాను ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కిద్‌మత్ సొసైటీ జాతీయ అవార్డు ప్రకటించింది. రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థ ప్రతినిధులు గురువారం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందని బాధ్యతాయుతంగా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తు పేదలను ఆదుకుంటామన్నారు.

## జేబీఎస్ నుంచి స్వర్ణగిరికి బస్సు సర్వీసులు షురూ

**కంటోన్మెంట్:** జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి యాదాద్రి జిల్లా భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి ఆలయానికి ప్రత్యేక బస్సు సర్వీసులను కంటోన్మెంట్ డిపో అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం రామ్మోహన్ మాట్లాడుతూ యాత్రికుల సౌకర్యార్థం ఉదయం 7 నుంచి రాత్రి 10.40 గంటల వరకు ప్రతి గంటకు ఒకటి చొప్పున డీలక్స్ బస్సులు నడుస్తాయన్నారు. జేబీఎస్ నుంచి స్వర్ణగిరి వరకు టికెట్ ధర రూ.100 ఉంటుందని తెలిపారు. తార్నాక నుంచి రూ.90, ఉప్పల్ ఎక్స్ రోడ్డు నుంచి రూ.80, ఘట్‌కేసర్ నుంచి రూ.60 చొప్పున టికెట్ ధర ఉంటుందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ఈ బస్సు ప్రయాణికులకు వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతి కృష్ణ, కంట్రోలర్లు బి. మల్లయ్య, పబ్బ శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

## నిరంకుశంగా వ్యవహరిస్తోన్న మోదీ సర్కార్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటి సభ్యులు

**ముషీరాబాద్:** కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గతంలో మాదిరిగానే నియంతృత్వంతో నిరంకుశంగా వ్యవహరిస్తోందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ప్రతినిధుల బృందం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేవంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్, కార్యదర్శి పోటు రంగారావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.జి.రాంచందర్, కె.రమ, ఎం.హన్మేష్, ఐఎఫ్‌టియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18వ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో నరేంద్రమోదీ మత విద్వేషప్రసంగాలు చేశారన్నారు. 140 కోట్ల భారత ప్రధాని ఇలా మాట్లాడడం చరిత్రలోనే లేదన్నారు. ప్రజలు మోదీ నియంతృత్వ, నిరంకుశ, అప్రజాస్వామిక పాలనను తిరస్కరించారన్నారు. 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. అయినా నరేంద్రమోదీ ప్రభుత్వం దీన్ని కూడా దిగ్విజయంగా మాట్లాడడం సరికాదన్నారు. నీట్-యూజీ పరీక్షల్లో పెద్ద స్కాం జరిగిందన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.